# సింగిల్ పేజీ కథలు

## షాక్!

**విశాఖ నుంచి హైదరాబాదు వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్ మెల్లగా ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం పైకి వచ్చేస్తోంది. జనంలో కలకలం చెలరేగింది. కదులుతున్న రైలుని పట్టుకుని లోపలికి దూకేస్తున్నారు కొందరు వీరబాబులు.**

సీటు ఖరారైన బోగీల పరిస్థితి ఇలా వుంటే, మామూలు బోగీ గురించి చెప్పేదేముంటుంది? అది రణరంగమే. అందులో దూకి, అందరిని చెండాడి చివరికి మన్మధరావు ఓ సీటు దక్కించుకున్నాడు. తలుపునకు దగ్గరగా, కిటికీ ప్రక్కనే వున్న సీటు చేజిక్కించుకోవటం అంత సులభం కాదు. సినిమాలో హీరోగారు ఎంతసేపు ఫైట్ చేసినా క్రాపు చెరగదు. కానీ, సామాన్య భోగీలో ఫైటింగ్ చేసిన మన్మధరావు క్రాఫింగ్ కాస్తా చెత్తయిపోయింది. క్షణం సేదదీరి, దువ్వెనతో తలదిద్దుకుని తొంగి చూచాడు. అప్పుడే మతిపోయింది అతగాడికి. అలా పోవటానికి కారణం ఓ ఐదడుగుల మూడంగుళాల అద్భుత సౌందర్యం. ఐస్‌లాంటి ఆ స్వీటీ కనిపించగానే ఐసయిపోయాడు మన్మధరావు. తన స్వగ్రామం అనకాపల్లిలో దివిటీ వెలిగించి దేవులాడినా ఇలాంటి స్వీటీ కనిపించదు. అదృష్టంకొద్దీ, ఆ అమ్మాయి ఈ బోగీ దగ్గరికి వచ్చి నుంచున్నది. తలుపునకు అడ్డంగా వేళ్లాడుతున్న కుర్రాళ్ళని గదమాయించి, స్వాగతం పలికాడు ఆమెకి.

అప్పటికే బోగీ నిండిపోయింది. అనకాపల్లి నుంచి ఉదయం కూరగాయల గంపలతో విశాఖ చేరుకున్న నాయుడమ్మలు తిరుగుప్రయాణం చేస్తున్నారు. తల పైన బుట్ట తీయకుండా దారికి అడ్డంగా నుంచున్నారు. పద్మవ్యూహాన్ని ఛేదించి స్వీటీ లోపలికి వెళ్లగలదా? ఆ ఊహరాగానే, హీరోలా మన్మధరావు సీటు ఖాళీ చేసి కంచుకిలా నుంచున్నాడు. మరికాస్త స్వీటుగా నవ్వి స్వీటీ సీటులోకెళ్లిపోయింది. కిటికీలో తల దూర్చేసి దేనికోసమో ఎదురుచూస్తోంది. పాపం! థ్యాంక్స్ చెప్పటానికి తీరికలేని ఆ ఎదురుచూపు ఏమిటో హీరో మన్మథరావుకి అర్థం కాలేదు. స్వీటీ చెయ్యి ఊపింది. మన్మధరావు తలవంచి అటువైపు చూచాడు. ఈ స్వీటీలాంటి మరో బ్యూటీ ఓ ముసలమ్మ చెయ్యి పుచ్చుకుని గబగబ వస్తోంది. ఇద్దరికీ దగ్గరి పోలికలున్నాయి. బోగీ దగ్గరికి రాగానే లోపలి స్వీటీ చటుక్కున దిగిపోయింది. చిటికలో చెరొక చెయ్యి పుచ్చుకుని ముసలమ్మని సీటెక్కించేశారు. జరిగిందేమిటో మన్మథరావుకి తెలిసేసరికి 'బయలుదేరుచున్నది' అన్న మాటలు మైకులో మోగటమూ, బండి కదలటమూ ఒకేసారి జరిగాయి.

"మామ్మా, జాగర్త" అన్నారు ముద్దుల మనుమరాళ్లు.



"పెందరాళే ఇంటికి వెళ్లండర్రా" పరాకు చెప్పింది మామ్మ. ఇద్దరి చెంపలు అద్దుకుని ముద్దులు పెట్టేసింది. ఎవరిగోల వారిదే. కనుచూపుమేర దాటేసి కదిలిపోయింది గోదారి. సీటు త్యాగం చేసి స్వీటీల టాటాలకి అవకాశం కల్పించిన మన్మధరావు మరుగున పడిపోయాడు. అమ్మాయిల అమ్మమ్మల చదరంగంలో పావుగా మారిపోయాడు. ముద్దు ముచ్చట మాట దేవుడెరుగు. కనీసం మూడో చిరునవ్వుకైనా నోచుకోలేదు. ప్రక్కసీటులో కుర్రాడు స్వీటు కావాలని మారం చేస్తున్నాడు. ఒకటి చాలదట. రెండివ్వాలని మొండిగా ఏడుస్తున్నాడు. విసిగిపోయి వాడి అమ్మ రెండింటితోపాటు మరో రెండు వాయించేసింది. కుర్రాడు తింటున్నాడు. ఏడుస్తున్నాడు. ఏడుస్తూనే తినేస్తున్నాడు. కాని, సీటు-స్వీటూ రెండూ పోగొట్టుకున్న మన్మధరావు అటు ఏడవనూ లేదు; ఇటు నవ్వుకోనూ లేదు. మన్మథరావుకి నిజంగానే మతిపోయేలా వుంది. తన్ను కన్నతల్లి అనకాపల్లి అసలైన పేరు 'అనేకఫలి'. ఎన్నో రకాల ఫల సంపత్తి వున్న ఊరు. అక్కడే తనకో స్వీటీ కరువవుతుందా? దివిటీ వెలిగించాలి. దేవులాడాలి. అనకాపల్లి స్టేషన్‌కి దగ్గరపడుతున్నకొద్దీ, పోయిన మతి మెల్లగా తిరిగి వస్తున్నట్లు అనిపిస్తోంది మన్మధరావుకి. దూకటానికి సిద్ధమయ్యాడు.

**-వి.రాఘవేంద్రరావు (హైదరాబాద్)**

## అర్థం

**"ఇదేమిటి పిన్నీ..అసలు ఇది మీ ఇల్లేనా?" సెలవులు హాయిగా పిన్నిగారింట్లో గడుపుదామని ఢిల్లీనుంచి వచ్చిన రాధ, రవి ఇద్దరూ ఒకేసారి అడిగారు.**

"అదేమిట్రా అలా అంటున్నారు.." వారికి మంచినీళ్ళు అందిస్తూ అడిగింది పిన్ని.

"ఘోరం..మహాఘోరం..చుట్టూ చక్కని పూలమొక్కలతో, మంచి పండ్లచెట్లతో పూలతోటలాగా కళకళలాడే మీ ఇల్లు, ఇలా రోగిష్టి శరీరంలా, ఎండిపోయిన నదిలా, బీటలువారిన భూమిలా ఇంత భయంకరంగా తయారయిందేమిటి పిన్నీ?" గడ గడా మంచినీళ్ళు త్రాగేసి గబ గబా అన్నాడు రవి.

"ఒరేయ్..మరీ అంత అన్యాయంగా మాట్లాడకురా, ఏదో నాలుగు అద్దె డబ్బులు వస్తాయని చెట్లన్నీ కొట్టించి పోర్షన్లు కట్టించాను. అంత మాత్రాన..."

"వాడన్నది నిజమే పిన్నీ..కాంక్రీట్ అరణ్యాల మీద విరక్తి కలిగి, ఈ సెలవులు నెలరోజులూ మీ వనవాటికలో హాయిగా, ప్రశాంతంగా కాలుష్యం లేని కమ్మని గాలి పీలుస్తూ, ప్రశాంతంగా బ్రతకాలని వచ్చాం. కానీ, ఇప్పుడు మీ ఇల్లు..జీవంలేని అందమైన రబ్బరు బొమ్మలా, కళావిహీనమయిన నవ్వులా ఉంది.." అన్నది రాధ సూట్‌కేస్ లోపలకు తీసుకెళ్తూ.

"ఓరి..మీ కవిత్వం కూడా..ఒకరిని మించి ఒకరయ్యారు. ఉండండి, కాఫీ తెస్తాను. స్నానాలు చేసి భోజనం చేద్దురు.." అన్నది పిన్ని వంటగదిలోకి వెళ్తూ.

'పిన్ని ఒక్కత్తి. పిల్లా పీచూ లేరు. ఆస్తి బోలెడు

ఉన్నది. అయినా, పిన్నికి ఇంత డబ్బు వ్యామోహం ఎందుకో..' అనుకున్నారు వాళ్ళిద్దరూ.

"పిన్నీ...నిజం చెప్పాలంటే, ఈ నెల రోజులూ మేము అన్నం, నీళ్ళూ కూడా మానేసి, స్వచ్ఛమైన గాలి మాత్రమే పీల్చి బ్రతకాలనుకున్నాం. ఇది అతిశయోక్తి అయినా, వినాశం సృష్టిస్తున్న వాతావరణ కాలుష్యానికి భయపడి, మంచి గాలి కోసం మేము అంత మొహం వాచిపోయి ఉన్నామన్నమాట.." అన్నాడు భోజనం చేస్తూ రవి.

పిన్ని ఎంత ఆదరంగా చూసినా, వాళ్ళు వారం కంటే ఎక్కువ ఉండలేక వెళ్ళిపోయారు.

మరో ఆర్నెలలకు, ఏదో ఇంటర్వ్యూకని మళ్ళీ ఆ ఊరు వచ్చిన వాళ్ళకు, చాపా, దిండూ లాంటి సరంజామాతో, ఇల్లు తాళం పెట్టి ఎక్కడికో బయలుదేరిన పిన్ని కనబడింది.


"ఏమిటి విశేషం?" అడిగింది రాధ.

ఈమధ్య ఒంట్లో అసలు బాగుండటం లేదు. ఎన్ని మందులు వాడినా ఏమీ ప్రయోజనం కనబడటం లేదు. డాక్టర్లు ప్రకృతి ఆశ్రమంలో కొన్నాళ్ళు గడిపి చూడమన్నారు. అందుకే బయలుదేరాను.." అన్నది చాలా బాధ పడుతూ.

ఆమెని ఎలా ఓదార్చాలో వాళ్ళిద్దరికీ అర్థం కాలేదు.

**-కోపూరి పుష్పాదేవి (విజయవాడ)**

# కపిరాజశ్రీ



**"పోతే పోనీ, పోయేకాలం వస్తే పోకమానదు. వచ్చేకాలం వస్తే రాకమానదు. కన్ను ఎత్తితే జననం, కన్ను దించితే మరణం. అయినా నీకెందుకు మనిషీ మధ్యనింత విరహం, వ్యామోహం" అని కవిత చదువుతున్న వాడల్లా ఓ క్షణం ఆగి- "విని తగలడుతున్నావా?" సుబ్బారావ్ తన భార్యని.**

"ఆ.. వింటున్నా. ఇందాకట్నుంచి కడుపులో ఎవరో చెయ్యి పెట్టి కెలికినట్లుంటే, పొద్దున్న తిన్న కట్‌లెట్ ప్రభావం అనుకున్నా. కానీ మీ కవిత్వమే కారణం అని ఇప్పుడే తెలుస్తోంది" అంది లక్ష్మమ్మ.

"ఇదిగో అనవసరంగా నన్ను రెచ్చగొట్టకు. అసలే నాకు తిక్కెక్కువ" అన్నాడు చిటపటలాడి పోతూ.

"ఆ విషయం తెలిసిందేగా. ఆ తిక్కతోనే మీరు రాసే కవితలు వినలేక, ఆ దిక్కుమాలిన కవితలు వింటూ శుభ్రంగా తినలేక, ఒక్కోసారి ఆ కవితలు గుర్తొచ్చి సరిగ్గా నిద్ర కూడా పట్టక మాలోకంలా తయారవుతున్నారు. కానీ ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి. మీ కవితలకి భయపడి ఇటు మీ బంధువులు, అటు మా తరపు బంధువులు మన ఇంటి వైపు రావాలంటేనే ఆంత్రాక్స్‌ని చూసినట్టు అదిరి, బెదిరి భయపడి ఛస్తున్నారు" అంది వెటకారంగా.

"నీకలాగే ఉంటుందే. ఒక్క కవిత ఏ పత్రికలో నన్నా అచ్చవని. అలా అచ్చయిన తర్వాత నా పాపులారిటీ పెచ్చుపెరిగి, రెచ్చిపోయి పాపులర్ పత్రికలు కూడా నా కవితల కోసం పోటీపడతాయి" చెప్పాడు సుబ్బారావ్.

"ఔనౌను. అప్పుడు గానీ ఆంధ్రాజనం మన ఇల్లు పీకి పందిరెయ్యరు" అందామె.

ఇంతలో "పోస్ట్" అని ఓ కవర్ విసిరి వెళ్లిపోయాడు పోస్ట్‌మేన్.

"ఎవరయ్యుంటారబ్బా!" అంది లక్ష్మమ్మ ఆ కవర్‌ని చేతిలోకి తీసుకుంటూ.

"కపిరాజశ్రీ మావయ్యకి" అని లక్ష్మమ్మ చదవటం మొదలెట్టగానే

"ఆపి తగలడవే అభాగ్యురాలా. అది కపిరాజశ్రీ కాదు. కవిరాజశ్రీ. అంటే నేనే. ఎప్పుడూ మహారాజశ్రీ అని రొటీన్‌గా రాయద్దన్నాను. అందుకే ఆ వింత సంబోధన, తర్వాత చదువ్"

లెటర్‌ని మళ్లీ చదవటం మొదలెట్టింది లక్ష్మమ్మ. "కవిరాజశ్రీ మావయ్యగారికి మీ అల్లుడు అనంతరావ్ మీ ఆశీర్వాదాలు ఆశిస్తూ వ్రాయునది ఏమనగా నేను క్షేమం. మీ అమ్మాయి క్షేమం. కానీ మా నాన్న గుండె క్షేమం తప్పి మళ్లీ గుండెపోటు వచ్చింది. ఇప్పుడు ఐ.సి.యు.లో బాగానే ఉన్నారు. కనుక మీరు ఈ విషయం గురించి ఆందోళన చెందవద్దు. ఇట్లు మీ అల్లుడు అనంతరావ్" అని లెటర్ చదివిన లక్ష్మమ్మ- "అయ్యో, అయ్యో. ఇదేం అపశకునమండీ! మన వియ్యంకుడికి మళ్లీ గుండెపోటా. మనం వెంటనే వెళ్దామంటే బోలెడు పనులు. కాబట్టి వెంటనే ఓ లెటర్ అయినా పోస్ట్ చేయాలండి" చెప్పింది లక్ష్మమ్మ.

"ఔను. లెటరే వెయ్యాలి మరి. ఎందుకంటే వాళ్లకి కనీసం ఇరుగు, పొరుగు ఫోన్ నెంబర్ కూడా లేదుగా" అని ఓ కాగితం తీసి లక్ష్మమ్మకిచ్చి "మనం త్వరలోనే రాగలమని, ఆయన త్వరగా కోలుకోవాలని రాయి" చెప్పాడు సుబ్బారావ్.

సుబ్బారావ్ చెప్పింది చెప్పినట్టు రాసిన లక్ష్మమ్మ చేతిలోని ఆ కాగితాన్ని తీసుకుని టేబుల్ మీద పెట్టి, డెస్క్‌లోంచి ఓ ఎన్వెలప్ కవర్ తీసుకుని, ఆ లెటర్‌ని మడతేసి అందులో పెట్టి "ఉండు దీన్ని పోస్ట్ చేసొస్తా" అని బయలుదేరాడు సుబ్బారావ్.

ఓ రెండ్రోజుల తర్వాత తీరిగ్గా పక్కింటి ప్రసాద్‌తో కూర్చున్న సుబ్బారావ్ "నేను కవి, కానీ నా బరువు హెవీ, నేను చీకటిలో రవి, నా విజ్ఞానం ఎండిపోని భావి, నాకిష్టమైన పాట సువ్వి, సువ్వి" అంటూ ప్రాణ కోసం ప్రాకులాడుతూ చెప్తున్న ఆ వింత కవిత వింటున్న ప్రసాద్, అప్పటికే సగం చచ్చిన మనిషిలా తయారయ్యాడు.

ఇంతలో లక్ష్మమ్మ వచ్చి "ఏవండి మన అల్లుడి దగ్గర్నుండి లెటర్ వచ్చింది."

"ఏవుంది మన వియ్యంకుడు కోలుకునుంటాడు" అన్నాడు సుబ్బారావ్.

"అదేం కాదు. రివర్స్ అయ్యింది. చూడండి" అంది. లక్ష్మమ్మ తెగ కంగారు పడుతూ.

"సుబ్బారావ్‌కి మీ అల్లుడు అనంతరావ్ వ్రాయునది. మా నాన్నకి గుండెపోటు వచ్చిందని నేను లెటర్ వ్రాస్తే, దానికి బదులుగా మీరు, పోతే పోనీ, పోయేకాలం వస్తే పోకమానదు. వచ్చేకాలం వస్తే రాకమానదు. అని ఓ దిక్కుమాలిన కవిత రాసి మా నాన్నని ఇంతగా అవమానిస్తారా. మీ అంతు చూస్తా. అంతేకాదు ఇక నుండి మన మధ్య ఏ విధమైన చుట్టరికం ఉండదు. కనీసం మీ అమ్మాయిని కూడా చూడ్డానికి రాకూడదు. సెలవు. అనంతరావ్" అని ఆ ఉత్తరాన్ని బిగ్గరగా చదివిన సుబ్బారావ్ "ఏంటీ ఇది! అల్లుడిలా శివాలెత్తిపోతున్నాడు" అన్నాడు ఏం అవగతం కాక.

"మీరు మొన్న పొద్దున్న నాకు చదివి వినిపించిన ఆ దిక్కుమాలిన కవితని పొరబాటున లెటర్ అనుకుని, ఆ కవర్‌లో పెట్టి పోస్ట్ చేసి ఉంటారు" అంది లక్ష్మమ్మ.

"అవునేవ్. అదే జరిగుంటుంది" దీనంగా తెల్లమొహం వేసి మరీ చెప్పాడు సుబ్బారావ్.

**-గంగాధర్ వడ్లమన్నాటి**
(విశాఖపట్నం)